క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నేరేడుచర్ల: నేరేడుచర్ల వన్ టౌన్ ఫీడర్ చానల్ కింద జాన్‌పహాడ్ రోడ్డు పరిధిలోని 11 కేవీ లైన్లు, స్తంభాలు మారుస్తున్నందున ఆదివారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ శనివారం తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

మునగాలలో..

మునగాల: మునగాల పంచాయతీ పరిధిలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ వికాస్ శనివారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో ఇండస్ట్రీయల్ ఫీడర్‌పై మరమ్మతుల కారణంగా విద్యుత్ నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో పుస్తకాల అమ్మకాలు నిషేధించాలి

మునగాల: ప్రైవేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, యూనిఫాం అమ్మకాలు నిషేధించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యాసంస్థల్లో పుస్తకాలను అధిక ధరలకు విక్రయించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి 2010లో విడుదల చేసిన జీఓను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. ప్రభుత్వం విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలని.. లేకుంటే విద్యార్థులను సమీకరించి బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

లిఫ్ట్ మరమ్మతులకు నిధులు కేటాయించాలి

మునగాల: మండలంలోని తిమ్మారెడ్డిగూడెం పరిధిలో ఎడమకాలువపై నిర్మించిన ధనలక్ష్మి ఎత్తిపోతల పథకం మరమ్మతు పనులకు నిధులు కేటాయించాలని గ్రామానికి చెందిన పలువురు రైతులు కోరారు. ఈమేరకు శనివారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో కలసి విన్నవించారు. గ్రామశాఖ అధ్యక్షుడు తిమ్మారెడ్డి రాఘవరెడ్డి మాట్లాడుతూ.. ధనలక్ష్మి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పైపులు పగిలిపోవడంతో కొంతకాలంగా మూతపడిందని, మరమ్మతు పనులకు అవసరమైన నిధులు కేటాయించి సక్రమంగా నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి త్వరలోనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు.

కంఠమహేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

నడిగూడెం: ఈ ఏడాది వర్షాలు బాగా కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని శనివారం నడిగూడెం మండల పరిధిలోని రత్నవరంలో శ్రీ కంఠమహేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు బోనాలు సమర్పించారు.


అయ్యప్ప దేవాలయంలో వార్షిక వేడుకలు



అన్నదానం నిర్వహిస్తున్న నిర్వాహకులు

మునగాల: మండల కేంద్రం శివారులో గల అయ్యప్ప దేవాలయంలో ఆలయ వార్షికోత్సవం శనివారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకం జరిపించారు. హోమం నిర్వహించి, అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్రీనివాసాచారి, అర్చకులు నరమనేని రామారావు గురుస్వామి భక్తులు పాల్గొన్నారు.

బూర్గులతండాలో వైద్యశిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు

నేరేడుచర్ల: మండలంలోని బూర్గులతండాలో ఓరియంటల్ ఇన్సూరెన్స్ రివర్ ఆస్పత్రి సౌజన్యంతో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఓరియంటల్ డీజీఎం సావిత్రి, వినయ్, సాగర్, సాయి, చౌహాన్, గగన్‌దీప్‌సింగ్, డాక్టర్ మోతీలాల్, రవీందర్‌రెడ్డి, రాజు, సుమన్, లింగయ్య, అమీర్ తదితరులున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



లక్కవరంలో మూలమలుపులో రహదారి వెంట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

- రక్షణ వలయాలు లేక మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- భయాందోళనలో ప్రజలు, వాహనదారులు

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. పొలాలు, రోడ్లకు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరక్కాయలగూడెం, మర్రిగూడెం, బూరుగడ్డ, లక్కవరం, గ్రామాల సమీపంలో ఇళ్లకు దగ్గరగా, అమరవరం, అంజలిపురం, శ్రీనివాసపురం, గోపాలపురం గ్రామాల్లో ప్రధాన రహదారుల వెంట ఏర్పాటు చేశారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు, రైతులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో బూరుగడ్డ, కరక్కాయలగూడెం రహదారి వెంట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వాహనాలు ఢీకొన్న ఘటనలు ఉన్నాయి. రోడ్ల వెంట తక్కువ ఎత్తులో ఏర్పాటు చేయడంతో మూగజీవాలు వాటికి తగిలి మృత్యువాత పడుతున్నాయని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



మర్రిగూడెంలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలి



రోడ్డు పక్కన తక్కువ ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు వెంట ప్రమాదకరంగా ఉండడంతో రాత్రి సమయాల్లో వాహనదారులకు ఎక్కువగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గ్రామాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు అధికారులు రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలి.

– షేక్ ఇమామ్, రైతు, కరక్కాయలగూడెం

సమస్యలు పరిష్కరిస్తాం



పలు గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ వలయాలు ఏర్పాటు చేస్తాం. అదేవిధంగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సిబ్బందితో సరిచేయించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– బూర రాంప్రసాద్, విద్యుత్ ఏఈ, హుజూర్‌నగర్



కరక్కాయలగూడెంలో రహదారిని ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



నేరేడుచర్ల: పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య

నేరేడుచర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నేరేడుచర్ల జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య అన్నారు. నేరేడుచర్లలోని ఎమ్మార్సీ భవనంలో ప్రభుత్వ పాఠశాలలకు అందించే పాఠ్యపుస్తకాలను శనివారం ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో చత్రునాయక్, ప్రధానోపాధ్యాయులు బాలు, సత్యనారాయణ, ఉపాధ్యాయులు శ్రీను, సత్యనారాయణ, నవీన్‌కుమార్, వీరారెడ్డి, ఎంఆర్సీ సిబ్బంది ఉన్నారు.

పాఠ్యపుస్తకాల అందజేత

గరిడేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు అందజేస్తోందని ఎంఈఓ చత్రునాయక్ తెలిపారు. శనివారం గరిడేపల్లి మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నప్ప, రవీందర్ రెడ్డి, సాయిలు, జానకిరాములు, సీఆర్పీలు రామకృష్ణ, అశోక్‌కుమార్, వెంకటేశ్వర్లు, రాములు, ఉమా, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

పాలకవీడు: మండలంలోని జాన్‌పహాడ్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఎంపీపీ భూక్యా గోపాల్ ఎంఈఓ చత్రునాయక్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రీరాంరెడ్డి, వెంకటేశ్వరరావు, వెంకట్‌రెడ్డి, గోపానాయక్, నాగార్జున, సంధ్యారాణి, సీఆర్‌పీలు వెంకటేశ్వర్లు, మంగ్తా తదితరులు పాల్గొన్నారు.



గరిడేపల్లి: ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ చత్రునాయక్

మఠంపల్లి మండలానికి 22,854 పుస్తకాలు మంజూరు



మఠంపల్లిలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ పార్వతి, ఎంఈఓ చత్రునాయక్

మఠంపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన 22,854 నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను శనివారం మఠంపల్లిలోని ఎంఆర్సీ కార్యాలయంలో ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్, ఎంఈఓ చత్రునాయక్‌లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండలానికి 12,974, నోట్‌బుక్స్, 9,880 పాఠ్యపుస్తకాలు మంజూరయ్యాయన్నారు. హెచ్‌ఎంలు చిరంజీవి, రామకృష్ణ, జానకిరాములు, సతీష్‌కుమార్‌గౌడ్, వెంకట్రామ్, పవన్‌కుమార్‌గౌడ్, సీఆర్పీలు, ఎల్‌డీఏ బాలు నాయక్, మాజీ సర్పంచ్ రామారావునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావు మృతి తీరని లోటు



హుజూర్‌నగర్: రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్: రామోజీరావు మృతి తీరని లోటు అని హుజూర్‌నగర్ కాకతీయ కమ్మ సంఘం నాయకులు కేఎల్‌ఎన్ రావు, అశోక్, అట్లూరి హరిబాబు అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసుదేవరావు, రవి, జనార్దన్‌రావు, సీహెచ్ శ్రీనివాస్‌రావు, సురేష్, సత్యనారాయణ, భాస్కర్ పాల్గొన్నారు.

రామోజీరావుకు నివాళి

చిలుకూరు: చిలుకూరు మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షుడు మల్లం వెంకటేశ్వర్లు, విలేకరులు దొడ్డా శ్రీధర్, కొదారు బ్రహ్మం, అనంతారపు గోవిందాచారి, నూకపంగు సైదులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



మఠంపల్లి: బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ పార్వతి



చిలుకూరు: బడిబాటలో భాగంగా ఇంటింటికి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

మఠంపల్లి: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ప్రైవేట్ పాఠశాలలకు ఫీజుల రూపంలో అయ్యే డబ్బును పిల్లల పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్ కోరారు. శనివారం మఠంపల్లి ఎస్సీకాలనీలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రభుదాస్, మాజీ ఎంపీపీ కొండానాయక్, మాజీ సర్పంచ్ రామారావునాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

చిలుకూరు: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ శనివారం చిలుకూరులో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మోతెలో బడిబాట

మోతె: మండలంలోని సిరికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శనివారం కాసిగూడెంలో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామళ్ల కోటేశ్వరరావు, బి.శ్రీనివాసచారి, ఉషారాణి, నర్సయ్య, గ్రామస్తులు, మహిళా సంఘాల సభ్యులు, సిరికొండ సీఆర్‌పీ కాంపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మోతె: కాచిగూడెంలో బడిబాట నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

కొత్తచాకిరాలలో బడిబాట

నడిగూడెం: బడి ఈడు పిల్లలను బడికి పంపాలని నడిగూడెం మండలంలోని కొత్త చాకిరాల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ వెంకటేశ్వర్లు కోరారు. శనివారం కొత్త చాకిరాలలో నిర్వహించిన బడిబాటలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రవీందర్, సీఆర్‌పీ నందిగామ రామారావు పాల్గొన్నారు.

రైతులు ఆయిల్‌పామ్ సాగు చేయాలి

సూర్యాపేట : నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని సూర్యాపేట ప్రాంతీయ ఉద్యాన అధికారి కన్నా జగన్ అన్నారు. సూర్యాపేట మండల పరిధిలోని కేసారం గ్రామంలో దండ మురళీధర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో నూతనంగా ఆయిల్‌పామ్ మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలను సద్వినియోగం చేసుకొని ఆయిల్‌పామ్ తోటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ పంటకు కూలి ఖర్చులు తక్కువ, కోతుల బెడద లేదన్నారు. ఆయిల్‌పామ్ పంటను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు, ప్రభుత్వం నియమించిన కంపెనీ వారే కొనుగోలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్ దండా మురళీధర్‌రెడ్డి, పతంజలి ఆయిల్‌పాఫామ్ కంపెనీ మేనేజర్ జె.హరీష్, జూనియర్ మేనేజర్ శశికుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ యానాల సుధాకర్‌రెడ్డి, జైన్ డ్రిప్ ప్రతినిధి జెట్టి మల్లేష్ పాల్గొన్నారు.



కేసారంలో ఆయిల్‌పామ్ మొక్కలు పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

కాలనీలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి

హుజూర్‌నగర్‌రూరల్: హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ మాచవరంలో ఉన్న డబుల్‌బెడ్ రూం ఇళ్ల కాలనీలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని గ్రామ అంబేద్కర్ యూత్ సభ్యుడు పాదిల నాగరాజు కోరారు. శనివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని 30 డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేసి ఆరు నెలలు గడుస్తున్నా వీధి దీపాలు మాత్రం ఏర్పాటు చేయలేదని తెలిపారు. ఆయన వెంట మట్టపల్లి, నర్సింహా, నాగరాజు తదితరులున్నారు.

కేసుల రాజీతో ఇరువర్గాలకు విజయం



హుజూర్‌నగర్: మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్

- సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్

హుజూర్‌నగర్: కేసులు రాజీ పడడం ద్వారా ఇరువర్గాలకు విజయం దక్కినట్లు అవుతుందని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని న్యాయస్థానంలో నిర్వహించిన మెగా లోక్‌అదాలత్‌లో ఆయన మాట్లాడారు. ఆస్తి వివాదాల కారణంగా ప్రజలు క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుంటున్నారని, తద్వారా తమ భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారన్నారు. వివాద రహితమైన సమాజాన్ని రూపొందించాల్సిన బాధ్యత పౌరులందరిపై ఉందన్నారు. జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ మాట్లాడుతూ.. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న పలు కేసులు రాజీ కాకపోవడానికి పంతాలు, పట్టింపులే కారణమన్నారు. కేసుల్లో ఇరుక్కొని కోర్టుల చుట్టూ తిరగడం, జైలు జీవితం గడపడం వల్ల తమ పిల్లల బంగారు భవిష్యత్ నాశనమవుతుందనే విషయాన్ని గ్రహించాలన్నారు. కాగా.. లోక్ అదాలత్‌లో 506 క్రిమినల్ కేసులు, 8 సివిల్ కేసుల్లో కక్షిదారులు రాజీపడగా వాటిని కొట్టివేస్తూ న్యాయమూర్తులు తీర్పు వెలువరించారు. వివిధ కేసుల్లో కక్షిదారులు రూ.3,36,500 జరిమానాగా చెల్లించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జక్కుల వీరయ్య, లోక్ అదాలత్ సభ్యులు ఎంఎస్ రాఘవరావు, చనగాని మహేష్, సుంకరి క్రాంతి కుమార్, చక్రాల వెంకటేశ్వర్లు, చనగాని యాదగిరి, కొట్టు సురేష్, న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, తెప్పని శ్రీలక్ష్మి, రామలక్ష్మారెడ్డి, కమతం నాగార్జున, రమణా రెడ్డి, సైదా హుస్సేన్, పాషా, శ్రీను నాయక్, వెంకటరెడ్డి, అంజయ్య, మహేష్ నాయక్, ఎస్‌ఐ ముత్తయ్య, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



కోదాడరూరల్: మాట్లాడుతున్న జడ్జి శ్యాంసుందర్

పెండింగ్ కేసులు పరిష్కరించుకోవాలి

కోదాడరూరల్: లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులను పరిష్కరించుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్యాంసుందర్ అన్నారు. శనివారం కోదాడ కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కోదాడ కోర్టులో పెండింగ్‌లో ఉన్న 3,874 కేసులను పరిష్కరించి రూ.16,87,920ల జరిమానా విధించారు. కార్యక్రమంలో సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ సీహెచ్ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌ఆర్‌కే మూర్తి, ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల రామిరెడ్డి, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్లు తాటి మురళీ, నాళం రాజన్న, అర్వపల్లి పవన్, అవుల మల్లికార్జునరావు, న్యాయవాదులు మేకల వెంకట్రావు, పాలేటి నాగేశ్వరరావు, ఈదుల కృష్ణయ్య, రంజాన్ పాషా, దావీదు, ఉయ్యాల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వెబ్‌సైట్ ఏర్పాటు చేయాలి

మునగాల: ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల లిస్టు, పోలైన ఓట్లు తదితర అంశాలకు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసి ప్రతి పౌరుడికి అందుబాటులో ఉంచాలని మునగాల మండలానికి చెందిన ప్రముఖ న్యాయవాది మిర్యాల మంగయ్య గౌడ్ కోరారు. ఈమేరకు రాష్ట్రపతికి ఈమెయిల్ ద్వారా లేఖ పంపినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వంశీ యాదవ్‌కు నివాళి



వంశీ యాదవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గాలి శ్రీనివాస్ నాయుడు

చిలుకూరు: బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి వంశీ యాదవ్ మృతి బాధాకరమని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి గాలి శ్రీనివాస్ నాయుడు అన్నారు. శనివారం చిలుకూరు మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన వంశీ యాదవ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి శ్రీనివాస్‌నాయుడు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ నాయకులు పచ్చిపాల రామకృష్ణ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు, నాయకులు పోలంపల్లి సుధాకర్ గౌడ్, బర్మావత్ సీతారాంసింగ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ గ్రామకమిటీ ఎన్నిక

మునగాల: మండల పరిధిలోని వెంకట్రాంపురంలో శనివారం రాష్ట్ర ఆల్ సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి సమక్షంలో గ్రామకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెవుల సైదయ్య, ఉపాధ్యక్షుడిగా జిల్లేపల్లి వెంకయ్య, ప్రధాన కార్యదర్శిగా లచ్చిమళ్ల వెంకట్రాములు, సహాయ కార్యదర్శిగా పి.బిక్షం, కార్యనిర్వాహక కార్యదర్శిగా జిల్లేపల్లి వెంకయ్య, కోశాధికారిగా దొంగరి వెంకటేశ్వర్లుతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

బస్‌షెల్టర్ లేక ఇబ్బందులు

- రోడ్డు విస్తరణలో బస్‌షెల్టర్ తొలగింపు
- ఏళ్లు గడుస్తున్నా తిరిగి ఏర్పాటు చేయని అధికారులు

చిలుకూరు: చిలుకూరు మండల కేంద్రంలోని కోదాడ– జడ్చర్ల జాతీయ రహదారిపై బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిలుకూరు గ్రామానికి ఇరుపక్కలా సీతారాంపురం స్టేజీ వద్ద, కవిత జూనియర్ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై బస్‌షెల్టర్లు ఏర్పాటు చేశారు. కానీ మండల కేంద్రంలో మాత్రం ఏర్పాటు చేయలేదు. చిలుకూరుకు వచ్చే వారు, పనులు నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో ఈ రోడ్డు ఎప్పుడు రద్దీగా ఉంటుంది. దీంతో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు ఎక్కడ నిలబడాలని ప్రశ్నిస్తున్నారు.

ఏళ్లు గడుస్తున్నా..

మండల కేంద్రంలో కోదాడ– జడ్చర్ల జాతీయ రహదారి విస్తరణ చేయకముందు బస్టాండ్ సెంటర్‌లో బస్ షెల్టర్ ఉంది. హైవే విస్తరణలో దీనిని తొలగించారు. ఏళ్లు గడుస్తున్నా బస్‌షెల్టర్ ఏర్పాటు చేయలేదు. ప్రయాణికులు ఇబ్బందులు తొలగించేందుకు జాతీయ రహదారి వారు చిలుకూరు సెంటర్‌లో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



చిలుకూరు బస్టాండ్ సెంటర్‌లో బస్‌షెల్టర్ లేక ఎండలో వేచి ఉంటున్న ప్రయాణికులు

బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలి



చిలుకూరు బస్టాండ్ సెంటర్‌లో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలి. పనులు నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు వారు ఎండలోనే నిలబడాల్సి వస్తోంది. ఈ రోడ్డు జాతీయ రహదారి కాకముందు బస్ షెల్టర్ ఉంది. రోడ్డు విస్తరణలో పోయింది. తిరిగి ఏర్పాటు చేయాలి.

– లక్ష్మి, చిలుకూరు

కుటుంబ సభ్యుల వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య



రంజిత్ (ఫైల్)

హుజూర్‌నగర్: కుటుంబ సభ్యుల వేధింపులతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం హుజూర్‌నగ్‌లో జరిగింది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ చిట్టిప్రోలు రంజిత్‌కుమార్(32) స్థానిక సీతారాంనగర్ కాలనీలోని ఓ అద్దె ఇంట్లో భార్య స్వప్న, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. తన భార్య, ఆమె కుటుంబ సభ్యుల వేధింపులతో రంజిత్‌కుమార్ శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి చిట్టిప్రోలు పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి డ్రైవర్ దుర్మరణం

కోదాడరూరల్: ట్రాక్టర్ పైనుంచి పడి డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈ ఘటన కోదాడ మండల పరిధిలోని దోరకుంట గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. దోరకుంటకు చెందిన కొమ్మగాని ఉపేందర్‌రావు(31) శుక్రవారం గ్రామంలో ట్రాక్టర్‌పై వెళ్తుండగా.. రోడ్డుపై గోతులు ఉండడంతో ఒక్కసారిగా ఎగిరి కిందపడ్డాడు. ట్రాక్టర్ అతడి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శనివారం మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చిలుకూరు: మండల పరిధిలోని రామాపురంలో శనివారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన వేముల లింగయ్య గేదె రోజు మాదిరిగా మేత కోసం పొలాల్లోకి వెళ్లగా విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.